# 2020 నవంబర్ 26, 27 తేదీలలో కార్మికుల 'అఖిల భారత సార్వత్రిక సమ్మె' పిలుపును, రైతాంగం ఇచ్చిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాలను విజయవంతం చేయండి

**తమ** న్యాయమైన డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ 2020 నవంబర్ 26న కార్మికులు ఇచ్చిన అఖిల భారత సాధారణ సమ్మె, 2020 నవంబరు 26, 27 తేదీలలో రైతాంగం ఇచ్చిన 'చలో ఢిల్లీ' పిలుపులకు – సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి తన మద్దతును, సంఘీభావాన్ని ప్రకటిస్తోంది.

ఈనాడు మనదేశంలో కార్మికులు అదుపులేని, అపరిమిత దాడులకు గురవుతున్నారు. దశాబ్దాల పోరాట ఫలితంగా వారు సాధించుకున్న కనీసపాటి హక్కులను కూడా కాలరాస్తూ కేంద్రంలోని బిజెపి పాలకులు దూకుడుగా ముందుకు సాగుతున్నారు. కార్మికుల గొంతుకను నులిమి వేస్తున్నారు. వారిని జీవమున్న పనిముట్లుగా, వెట్టి కార్మికులుగా దిగజార్చారు. మన దేశ శ్రామిక ప్రజానీకం తమ చెమట, నెత్తురులు చిందించి అభివృద్ధి చేసిన బ్యాంకులు, ఎల్ఐసి, గనులు, రైల్వేలు, పరిశ్రమలు ఇతర సహజవనరులన్నింటినీ సామ్రాజ్యవాదుల, భారత కార్పొరేటు కంపెనీల హస్తగతం చేస్తున్నారు. కార్మికులను ఇతర శ్రామిక ప్రజానీకాన్ని స్వేచ్ఛగా దోపిడీ చేసుకొని, వారి రక్తాన్ని జుర్రుకోవటానికి మరింతగా అనుమతిస్తున్నారు. నానాటికీ పెరుగుతోన్న జీవన వ్యయపు భారీ యిరుసులలో పడి నలిగి నుజ్జు అయే విధంగా కార్మికుల జీవితాలను కుదించే వైపుగా నెడుతున్నారు. తమ ఆర్థిక సంక్షోభ భారాలను కార్మికులపై మోపే పాలకుల నిరంతరాయ ప్రయత్నాలు, కార్మికుల జీవన స్థితిగతులను నానాటికీ దిగజారుస్తూ, వారి జీవితాలను దుర్భరంగా, విషాదకరంగా మారుస్తున్నాయి.

భూమిపై రైతాంగపు హక్కు మీద వినాశకర దాడి చేస్తున్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించటానికి నిరాకరిస్తున్నారు. వ్యవసాయాన్ని విధ్వంసం చేస్తూ రైతులను దివాలా తీయిస్తున్నారు. భూమిని, వ్యవసాయాన్ని కార్పొరేటీకరించటం ద్వారా వ్యవసాయరంగంపై సామ్రాజ్యవాదుల, భారత కార్పొరేటు శక్తుల, భూస్వాముల అంతులేని దోపిడీ, ఆధిపత్యాలకు భారత పాలకులు నేడు గేట్లు బార్లా తెరిచారు. ఇటీవలి కాలంలో రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేసిన మూడు చట్టాలు, రైతాంగంపై సాగుతున్న ఈ దాడిలో భాగమే.

నవంబర్ 26, 27 తేదీలలో కార్మికుల, రైతుల అఖిల భారత స్థాయి నిరసనాందోళనలు ఈసారి ఒకే సమయంలో జరుగుతున్నాయి. ఇది ఇరువురికీ శక్తిని ఉత్సాహాన్నీ ఇస్తుంది. ఈ నిరసన కార్యక్రమాలు అన్ని ఆటంకాలను, నిర్బంధ చర్యలను అధిగమించగలవని ఇతర శ్రామిక ప్రజల, ప్రజాస్వామిక శక్తుల సంఘీభావాన్ని పొందగలవని, వాస్తవికమైన ప్రజా కార్యక్రమాలుగా రూపొందగలవని ఆశిస్తున్నాము. దోపిడీ పాలకవర్గాల లొంగుబాటు విధానాలకు, వారి ప్రజావ్యతిరేక, నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా మరిన్ని సమైక్య నిర్ణయాత్మక పోరాటాలకు ఈ ఆందోళనలు ఉత్ప్రేరకం కాగలవని ఆశిస్తున్నాము.

- ❖ నవంబర్ 26, 27 తేదీలలో కార్మికుల, రైతుల నిరసనాందోళనలను విజయవంతం చేయండి
- ❖ కార్మిక-రైతాంగ ఐక్యత వర్ధిల్లాలి
- ❖ భారత పాలకవర్గాల సామ్రాజ్యవాద, బడా బూర్జువా, భూస్వామ్యవర్గ అనుకూల విధానాలు నశించాలి.

**విశ్వం**

**21-11-2020**

ప్రధాన కార్యదర్శి

సిపిఐ(ఎం-ఎల్)

★ ★ ★